సాక్షి
అనంతపురం
ఆదివారం । 11 । మే । 2025



చీనీ టన్ను రూ.22,800

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22,800 పలికాయి.



రేపు గార్లదిన్నెలో గ్రీవెన్స్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం గార్లదిన్నె మండలంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
40.3°/ 23.1°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం అధికంగా కొనసాగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

ఉరవకొండ రూరల్: మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలకు శనివారం అంకుర్పారణ గావించారు. ముందుగా శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. ఉదయం స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజ స్తంభం వద్ద ఆలయ ఈఓ సాకే రమేష్ బాబు, ప్రధాన అర్చకులు ద్వారకానాథచార్యులు, బాలాజీస్వామి ప్రత్యేక పూజలు చేశారు.

నేడు నృసింహుని జయంతి..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం లక్ష్మీ నృసింహస్వామి జయంతి నిర్వహిస్తారు. ఈ సందర్భంగా స్వామి వారు సింహ, చంద్ర ప్రభ వాహనాలపై భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆలయ ఈఓ రమేష్‌బాబు తెలిపారు.

బాలికతో శ్రీవారి నిశ్చితార్థం



శ్రీమార్కండేయస్వామి ఆలయంలో కంకణ ధారణ దృశ్యం, చిత్రంలో బాలిక శ్రీధన్య

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 20వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు శనివారం స్వామి వారికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి పట్టణంలోని మార్కండేయస్వామి ఆలయంలో కంకణధారణ జరిగింది. వందేళ్ల నుంచి వస్తున్న విశిష్ట సంప్రదాయంలో భాగంగా పద్మశాలియ అరవ తెగకు చెందిన బాలికతో శ్రీవారి వివాహ మహోత్సవం (ఈ నెల 15న) జరిపించేందుకు నిశ్చితార్థం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ ఏడాది పట్టణానికి చెందిన అరవా శ్రీనివాసులు, శ్వేత దంపతుల కుమార్తె శ్రీధన్యతో శ్రీవారి కల్యాణం జరగనుంది. శ్రీవారి తరఫున బ్రాహ్మణులు, పుర పెద్దలు, దేవదాయశాఖ అధికారులు, పెళ్లికుమార్తె తరఫున బాలిక తల్లిదండ్రులు, బంధువులు, పద్మశాలీయ కులస్తులు తాంబులాలను ఇచ్చిపుచ్చుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ధ్వజారోహణ, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ, సాయంత్రం శ్రీవారి సింహవాహనోత్సవం జరుగుతుందని ఈఓ నరసింహారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలీయ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు అరవా శివప్ప, చుంచుల నాగప్ప, మున్సిపల్‌చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, గౌని ఉపేంద్రరెడ్డి, పొరాళ్ల శివకుమార్, గాజుల వెంకటేశులు, బంగి శంకర్ పాల్గొన్నారు.

అగ్నివీరుడికి అశ్రునివాళి

- వీరసైనికుడు మురళీ నాయక్‌కు ఘన నివాళి
- స్వగ్రామం చేరుకున్న వీర జవాన్ భౌతికకాయం
- బెంగళూరు నుంచి రోడ్డుమార్గంలో కల్లితండాకు తరలింపు
- దారిపొడవునా పూలవర్షం కురిపిస్తూ ఘన నివాళులు
- ఊరూరా వందేమాతరం ఆలపించిన ప్రజలు
- రోడ్డుకు ఇరువైపులా నిలబడి సైనికుడికి సెల్యూట్ చేసిన వైనం
- నేడు కల్లితండాలో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు
- తరలిరానున్న ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు

దేశరక్షణలో నేలకొరిగి భరతమాత నుదుట తిలకమై నిలిచిన వీర జవాన్ మురళీనాయక్‌కు అనంత ప్రజానీకం అశ్రునివాళి అర్పించింది. బెంగళూరు ఎయిర్‌పోర్టు నుంచి కల్లితండా వరకూ వెంటసాగి జోహార్ అగ్నివీరుడా అంటూ నినదించింది.



మురళీనాయక్ భౌతికకాయం వద్ద విషణ్ణ వదనంతో తల్లిదండ్రులు శ్రీరాంనాయక్, జ్యోతిబాయి

గోరంట్ల: 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా జమ్మూకశ్మీర్‌లో శత్రువులను తుదముట్టిస్తూ వీరమరణం పొందిన కల్లితండాకు చెందిన జవాన్ మురళీ నాయక్ భౌతికకాయం శనివారం రాత్రి స్వగ్రామం చేరుకుంది. మధ్యాహ్నం బెంగళూరు కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకోగా.. అక్కడి నుంచి కల్లితండాకు రోడ్డుమార్గంలో అమరుడి భౌతికకాయాన్ని సైనిక వాహనంలో తరలించారు. దారిపొడవునా ప్రజలు పూలుచల్లుతూ..వందేమాతరం పాడుతూ మురళీనాయక్‌కు ఘన నివాళులర్పించారు.

ఘొల్లుమన్న కల్లితండా

సైనిక దుస్తుల్లో ఠీవిగా వెళ్లిన కుమారుడు నిర్జీవంగా ఓ చెక్కపెట్టెలో కనిపించడంతో మురళీనాయక్ తల్లిదండ్రులు శ్రీరాంనాయక్, జ్యోతిబాయి బోరున విలపించారు. రాత్రి 9.30 గంటలకు మురళీ నాయక్ భౌతికకాయాన్ని సైనిక అధికారులు ఇంటి ముందు ఉంచడంతో ఆయన తల్లి జ్యోతిబాయి పరుగున వెళ్లి హత్తుకుంది. 'మమ్మల్ని అన్యాయం చేసి వెళ్లావా బిడ్డా' అంటూ కన్నీరుమున్నీరైంది. 'చూడు మురళీ... నీ కోసం ఎంత మంది వచ్చారో' అంటూ ఆమె రోదించిన తీరుతో అక్కడున్న వారంతా శోకసంద్రంలో మునిగిపోయారు. మురళీనాయక్ బంధువులు, సన్నిహితులతో పాటు ఉమ్మడి జిల్లా నుంచి తరలివచ్చిన అశేష ప్రజానీకం మురళీనాయక్ భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. నేటి మధ్యాహ్నం 12.30 గంటల నుంచి ఒంటిగంట మధ్యలో అధికార లాంఛనాలతో మురళీనాయక్ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ



నివాళులర్పిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: మురళీ నాయక్ అంత్యక్రియలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ రత్న తెలిపారు. శనివారం ఆమె కల్లితండాలో పర్యటించారు. అధికారిక లాంఛనాలతో మురళీ నాయక్ అంత్యక్రియలు జరగనున్న నేపథ్యంలో ఎస్పీ రత్న ఏర్పాట్లపై స్థానిక అధికారులతో చర్చించారు. మురళీ నాయక్‌కు నివాళులర్పించేందుకు ఆదివారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, హోం మంత్రి అనిత కల్లితండా రానుండగా భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. రాత్రి మురళీనాయక్ భౌతిక కాయానికి నివాళులు అర్పించారు.



మురళీనాయక్ భౌతికకాయాన్ని తీసుకువస్తున్న సైనిక వాహనాన్ని అనుసరిస్తున్న యువకులు



గుమ్మయ్యగారిపల్లి క్రాస్ వద్ద రోడ్డుకు ఇరువైపులా నిలబడి ఉన్న ప్రజలు



బెంగళూరు విమానాశ్రయం వద్ద మురళీనాయక్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న సైనికులు

ఊరూరా ఉద్విఘ్నం



మురళీనాయక్ భౌతికకాయం తరలిస్తున్న సైనిక వాహనం ముందు నడుస్తున్న యువత

చిలమత్తూరు/గోరంట్ల: మురళీనాయక్ భౌతిక కాయాన్ని శనివారం బెంగళూరు కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సైనిక వాహనంలో అతని స్వగ్రామం కల్లితండాకు తరలించే సమయంలో ఊరూరా ఉద్విగ్న వాతావరణం నెలకొంది. దారిపొడవునా ప్రజలు జాతీయ జెండాలు చేతబట్టుకుని వీర జవాన్‌ను తరలిస్తున్న సైనిక వాహనానికి ఎదురెళ్లారు. వందేమాతరం పాడుతూ దేశంకోసం ప్రాణాలు అర్పించిన మురళీ నాయక్‌కు ఘన నివాళులర్పించారు. వాహనంపై పూలవర్షం కురిపిస్తూ 'అమర్ రహే మురళీనాయక్'.. జోహార్ మురళీ నాయక్'.. సలాం సైనికా అంటూ గొంతెత్తి నినదించారు.

కొడికొండ చెక్‌పోస్ట్‌లో పూలవర్షం

మురళీ నాయక్ భౌతికకాయాన్ని బెంగళూరు ఎయిర్‌పోర్టు నుంచి స్వగ్రామానికి తరలిస్తున్నట్లు సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న జనం రాష్ట్ర సరిహద్దులోని కొడికొండ చెక్‌పోస్ట్ వద్దకు భారీగా చేరుకున్నారు. యువకులు, వృద్ధులు, మహిళలు, చిన్నారులు వేలాదిగా అక్కడకు చేరుకుని వందేమాతరం పాడుతూ 'జై జవాన్' అంటూ నినాదాలు చేశారు. జనం భారీగా తరలిరావడంతో మురళీనాయక్ భౌతిక కాయాన్ని తరలిస్తున్న సైనికవాహనం బాగేపల్లి టోల్ ప్లాజా నుంచి చెక్‌పోస్ట్‌కు రావడానికి గంటన్నర సమయం పట్టింది. చెక్‌పోస్ట్‌లో వాహనాన్ని నిలిపి మురళీనాయక్ భౌతిక కాయం చూసేందుకు జనం ప్రయత్నించారు. భావోద్వేగంతో భరతమాత ముద్దుబిడ్డ అంటూ నినాదాలు చేశారు. వాహనంపైకి పూలవర్షం కురిపించి అమర వీరుడికి అంజలి ఘటించారు. ఈ సందర్భంలోనే పలువురు మహిళలు మురళీనాయక్ భౌతిక కాయం ఉన్న పెట్టెను చూసి బోరున విలపించారు. తమ బిడ్డనే కోల్పోయినట్లు ఆర్తనాదాలు చేశారు.

జనసంద్రమైన గుమ్మయ్యగారిపల్లి క్రాస్

కొడికొండ, కోడూరు, శెట్టిపల్లి, బూదిలి మీదుగారాత్రి 8.20 గంటలకు సైనికవాహనం గుమ్మయ్యగారిపల్లి క్రాస్ చేరుకోగానే...అక్కడ ఉద్విఘ్న వాతావరణం నెలకొంది. అప్పటికే ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి భారీగా తరలివచ్చిన జనం 'మురళీ నాయక్ అమర్ రహే'...'భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలు చేశారు. వాహనంపై పూలు చల్లుతూ వాహనం వెంట అనుసరించారు. రాత్రి 9.30 గంటలకు మురళీ నాయక్ భౌతికకాయాన్ని తీసుకువచ్చిన సైనికవాహనం అతని స్వగ్రామం కల్లితండా చేరుకుంది.

భారీ ర్యాలీ నిర్వహించిన యువత

కొడికొండ నుంచి పలువురు యువకులు బైక్‌లపై మురళీనాయక్ భౌతికకాయం తీసుకువస్తున్న వాహనాన్ని అనుసరించారు. త్రివర్ణపతాకాలు చేతపట్టి 'భారత్‌మాతాకీ జై' అంటూ నినదించారు. సైనికా వందనం అంటూ గీతాలు ఆలపించారు.

వీర జవాన్ కుటుంబానికి అండగా ఉంటాం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం కార్పొరేషన్: యుద్ధ భూమిలో శ్రీ సత్య సాయి జిల్లా కల్లితండాకు చెందిన జవాన్ మురళీ నాయక్ వీర మరణం పొందడం బాధాకరమని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో పోరాడుతూ మురళీ నాయక్ మృత్యు ఒడికి చేరడం బాధాకరమన్నారు. ఆయన త్యాగాన్ని దేశం ఎప్పటికీ మరువదని చెప్పారు. బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ప్రముఖుల పరామర్శ



మురళీనాయక్ తండ్రిని పరామర్శిస్తున్న శంకరనారాయణ, ఎమ్మెల్సీమంగమ్మ



శ్రీరాంనాయక్‌ను ఓదారుస్తున్న కలెక్టర్ చేతన్

శనివారం కల్లితండాలోని వీర జవాన్ మురళీ నాయక్ కుటుంబాన్ని పలువురు ప్రముఖులు పరామర్శించారు. తల్లిదండ్రులు శ్రీరాంనాయక్, జ్యోతిబాయిలకు ధైర్యం చెప్పి ఓదార్చారు. మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహరాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఉదయ్ సమంత్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు శంకరనారాయణతో పాటు ఎమ్మెల్సీ మంగమ్మ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె తనయుడు శ్రీరాం, ప్రముఖ సింగర్ మంగ్లీ, తెలంగాణ రాష్ట్రానికి చెందిన సింగర్ బిచ్చు నాయక్, సోమందేపల్లి, గోరంట్ల, పెనుకొండ మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు మురళీనాయక్ కుటుంబసభ్యులను పరామర్శించి.. మురళీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



మురళీనాయక్ కుటుంబీకులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు రామకృష్ణ, జగదీష్

హంద్రీ–నీవాపై చర్చకు సిద్ధమా బాబూ?

- టీడీపీ పదహారేళ్ల పాలనలో గంపెడు మట్టి కూడా వేయలేదు
- శంకుస్థాపనలకే పరిమితం చేసిన ఘనుడు చంద్రబాబు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: 'కృష్ణా జలాలు రాయలసీమ వాసుల కల. ఇందుకోసం మహానేత వైఎస్సార్‌తో పాటు వివిధ రాజకీయాల పార్టీల నాయకులు, మేధావులు ఎన్నో దశాబ్దాలుగా ఇక్కడ పెద్దఎత్తున పోరాటాలు చేశారు. దాని ఫలితమే హంద్రీ-నీవా. ఈ సత్యాన్ని ప్రపంచానికి తెలియనీయకుండా ఇప్పటికీ చంద్రబాబు మరో సారి తన నైజాన్ని బయటపెడుతూ చరిత్రను వక్రీకరిస్తున్నారు. హంద్రీ-నీవాపై చర్చకు సిద్ధమా చంద్రబాబూ' అంటూ వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి సవాల్ విసిరారు. శనివారం ఆయన అనంతపురంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఎం చంద్రబాబుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ హయాంలో ఏడేళ్లు, చంద్రబాబు హయాంలో 9 ఏళ్లకుపైగా...మొత్తం 16 ఏళ్లపాటు హంద్రీ-నీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు గంపెడు మట్టిని కూడా వేయకుండా జిల్లాకు తీరని ద్రోహం చేశారన్నారు. దివంగత నేత వైఎస్సార్ హయాంలోనే హంద్రీ-నీవా పరుగులు పెట్టిందన్నారు. హంద్రీ-నీవా కాలువను సందర్శించి ఛాయాపురం వద్ద చంద్రబాబు మాట్లాడిన తీరు చూస్తే ఎటువంటి మార్పు ఆయనలో కన్పించలేదని స్పష్టమైందని, ఆయన జీవితమంతా అబద్ధాలకే పరిమితమైందని విమర్శించారు. సీఎం చంద్రబాబు, మంత్రి పయ్యావుల కేశవ్, ఆ పార్టీ ప్రజాప్రతినిధులు వారు చేయని పనులను కూడా చేసినట్లు ప్రచారం చేసుకున్నారు తప్ప ఇంకేమీ లేదన్నారు. మిర్చి, కంది, శనగ, పత్తి పంటలకు గిట్టుబాటు ధర లేదని, రైతాంగం పరిస్థితి గురించి చంద్రబాబు సభలో ఒక్క ప్రజాప్రతినిధి కూడా మాట్లాడలేదని, మంత్రి కేశవ్ చంద్రబాబును పొగడ్తలతో ముంచెత్తేందుకే సమయం కేటాయించారని విమర్శించారు.

ఒక్క అడుగూ ముందుకు వేయలేదు

1983లో అప్పటి సీఎం ఎన్టీఆర్ ఓడీసీ వద్ద, 1996 మార్చి 11న అప్పటి సీఎం చంద్రబాబు ఉరవకొండ పోలీసు స్టేషన్ ముందు హంద్రీ-నీవాకు శంకుస్థాపన మాత్రమే చేశారని, ఆ కార్యక్రమంలో అప్పుడు మంత్రిగా ఉన్న పరిటాల రవి, శాసనసభ్యులుగా రామకృష్ణ, పయ్యావుల కేశవ్ ఉన్నారని, 1999 ఎన్నికలు వచ్చే వరకు ఒక గంప మన్ను కూడా తీయలేదని గుర్తు చేశారు. చివరకు శంకుస్థాపనకు రూ.2.5 లక్షలు ఖర్చు చేసిన కాంట్రాక్టర్‌కు డబ్బు ఇవ్వకపోవడంతో ఆయన కోర్టును ఆశ్రయించారని తెలిపారు. 1983, 1996 నాటి జీఓలను రద్దు చేసి తిరిగి 1999 జులై తొమ్మిదో తేదీ 40 టీఎంసీలుగా ఉన్న హంద్రీ-నీవా సాగునీటి ప్రాజెక్టును ఐదు టీఎంసీల తాగునీటి ప్రాజెక్టుగా మార్చి జీఓను ఇచ్చి ఆత్మకూరు వద్ద మరోసారి శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. 2005లో సీఎంగా వైఎస్సార్ ఉన్న సమయంలో ఉరవకొండ పోలీసు స్టేషన్ వద్ద హంద్రీ-నీవా పనులకు శంకుస్థాపన జరిగిందని, ఆయన చలువతోనే ప్రాజెక్ట్ వేగవంతంగా సాగిందన్నారు. 2012 నవంబర్ 18న అప్పటి సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి నీటి విడుదల ప్రారంభిస్తే.. అదే నెల 29న ఎంపీగా ఉన్న తాను, అప్పటి మంత్రి రఘువీరా రెడ్డి జీడిపల్లి రిజర్వాయర్‌కు నీరు తీసుకు వచ్చామన్నారు. రైతాంగ శ్రేయస్సు కోసం, తాగు నీటి అవసరాలకు, భవిష్యత్తులో పరిశ్రమలకు హంద్రీ-నీవా కాలువను వెడల్పు చేయాల్సిన అవసరం ఉందని, 3,850 క్యూసెక్కులకే పరిమితం చేయకూడదన్నారు. తక్షణం లైనింగ్ పనులు ఆపి, 10 వేల క్యూసెక్కుల సామర్థ్యానికి కాలువను విస్తరించేలా చంద్రబాబును ఒప్పించాలన్నారు. 2019లో అనంతపురంలో కంటి వెలుగు ప్రారంభోత్సవానికి వచ్చిన అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి హంద్రీ-నీవా కాలువ సామర్థ్యాన్ని పెంచాలని విన్నవించామన్నారు. దీంతో 6,300 క్యూసెక్కుల సామర్థ్యంతో విస్తరణకు అనుమతిస్తూ 2021 జులైలో జీఓ ఇచ్చారని, తమ ప్రభుత్వ హయాంలోనే రూ.4,647 కోట్లతో టెండర్లు పిలిచారని గుర్తు చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట మధు, నాయకులు ఖాజా, గోగుల పుల్లయ్య, చామలూరు రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యోగుల సమస్యలు పట్టని ప్రభుత్వం '



మాట్లాడుతున్న ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఆర్థిక పరమైన సమస్యలు అటుంచి ఆర్థికేతర సమస్యలపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదన్నారు. దీంతో ఉద్యోగులు అభద్రతా భావంలో ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదవుతున్నా పీఆర్‌సీ కమిషన్ నియమించలేదన్నారు. దీంతో ఉద్యోగులకే నష్టమని, పీఆర్‌సీ బకాయిలు పెండింగ్‌లో పెడతారన్నారు. 2024 జనవరి, జూన్, 2025 జనవరికి సంబంధించి మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ నెల దాటితే మరో డీఏ వచ్చి కలుస్తుందని, ఇప్పటికీ ఒక్క డీఏ కూడా ప్రకటించలేదన్నారు. ఆక్రమణల తొలగింపు, ఇసుక దందా, రేషన్ అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో తహసీల్దార్లు బలవుతున్నారన్నారు. 2014లో గుంటూరులో ఆక్రమణల తొలగింపు క్రమంలో అప్పటి తహసీల్దారు తాతారావుపై కోర్టు చర్యలు తీసుకుందన్నారు. డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న ఆయనకు తహసీల్దారుగా డిమోషన్ ఇచ్చిందని వాపోయారు. ఆక్రమణల తొలగింపు విషయంలో ప్రభుత్వం, అధికారుల ఆదేశాల మేరకు ఆయన పనిచేశారని, అలాంటప్పుడు ఈ కేసులో ప్రభుత్వం ఎందుకు ఇంప్లీడ్ కాలేదని ప్రశ్నించారు. పైవారు చెప్పిన పనిచేసినందుకు ఆ అధికారి మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందన్నారు. ఒక నిర్ణయంపై అధికారులు లిఖితపూర్వంగా ఆదేశాలిస్తేనే అమలు చేయాలని తహసీల్దార్లకు చెబుతున్నామన్నారు. తహసీల్దారు కార్యాలయాల నిర్వహణకు, ప్రోటోకాల్‌కు రూ. లక్షలు ఖర్చు అవుతున్నా ప్రభుత్వం నిధులు ఇవ్వకపోతే ఎలా పనిచేస్తారని ప్రశ్నించారు. కోర్టు కేసులకు లీగల్ చార్జీలు ఇవ్వడం లేదన్నారు. తహసీల్దారు కార్యాలయాల్లో తెల్లకాగితాలు కూడా సొంత డబ్బుతో కొనాల్సి వస్తోందన్నారు. విధి నిర్వహణలో రెవెన్యూ ఉద్యోగులు తీవ్ర ఒత్తిడితో పనిచేయాల్సి వస్తోందన్నారు. ఉన్నతాధికారులు తమ నిర్ణయాలను కిందిస్థాయి అధికారులపై రుద్దుతున్నారన్నారు. రెవెన్యూలోని అన్ని కేడర్‌లలో పనిచేసే వారికి శిక్షణ ఇచ్చేందుకు రెవెన్యూ అకాడమీని ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో రెవెన్యూ ఉద్యోగులు సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటరాజేష్, ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ దివాకర్‌రావు, కార్యదర్శి సోమశేఖర్, మహిళ విభాగం చైర్‌పర్సన్ సురేఖరావు, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట చెన్నప్ప పాల్గొన్నారు.

మద్యం అతిగా సేవించి వ్యక్తి మృతి



మృతుడు జయ చంద్రారెడ్డి

తాడిపత్రి: మద్యం అతిగా సేవించి వ్యక్తి మృతి చెందిన ఘటన తాడిపత్రి రూరల్ పరిధిలోని జగనన్న కాలనీలో జరిగింది. సీఐ శివ గంగాధర రెడ్డి తెలిపిన మేరకు.. తాడిపత్రి పట్టణం నంద్యాల రోడ్డుకు చెందిన జయ చంద్రారెడ్డి (45) శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. శనివారం ఉదయం జగనన్న కాలనీలోని ఓ ఇంటి ముందు మద్యం మత్తులో అపస్మారక స్థితిలో పడి ఉన్న జయచంద్రారెడ్డిని గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే రూరల్ పోలీసులు అక్కడికి చేరుకుని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య అమరావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బ్రాహ్మణ విద్యార్థినులకు ఉపకార వేతనాలు

అనంతపురం కల్చరల్: ప్రతిభ కలిగిన బ్రాహ్మణ విద్యార్థినులకు ఉపకార వేతనాలను అందిస్తున్నట్లు బ్రాహ్మణ విద్యార్థినీ మహిళా సంక్షేమ సంఘం కార్యదర్శి రమాదేవి తెలిపారు. ఆరో తరగతి నుంచి పీజీ వరకు చదువుతున్న పేద బ్రాహ్మణ బాలికలు అర్హులని, 97037 89201, 94901 30999 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



అమ్మ స్ఫూర్తితోనే ఉన్నత స్థాయికి

అమ్మ గురించి ఎంత చెప్పినా తక్కువే అనిపిస్తుంది. మేము నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో ఉండేవాళ్లం. అమ్మ వెంకట సుబ్బమ్మ, నాన్న వేణుగోపాలరావు. ఆరో తరగతికి కొడిగెనహళ్లిలో అడ్మిషన్ పొందాను. అప్పటి వరకు అమ్మతోనే ఉండేవాడిని. ఆళ్లగడ్డ నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో పొలం ఉండేది. ఆళ్లగడ్డ నుంచి నిత్యం పొలం పనులకు వెళ్తూ.. ఎంతో కష్టపడేవారు అమ్మ. మేము నలుగురు అబ్బాయిలం. వారిలో నేను పెద్దవాడిని. ముగ్గురు అమ్మాయిలు. నేను బీటెక్ మొదటి సంవత్సరం చదువుతుండగా నాన్న కాలం చేశారు. అప్పటి నుంచి మా కోసం అమ్మ ఎంతో కష్టపడ్డారు. జేఎన్‌టీయూ అనంతపురం వీసీ స్థాయికి ఎదగడానికి అమ్మ కృషి ఎంతో ఉంది. ప్రస్తుతం అమ్మకు 82 సంవత్సరాలు. అమ్మ అండదండలతోనే ఉన్నతస్థాయికి చేరాను.

– ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, వీసీ, జేఎన్‌టీయూ అనంతపురం


అమ్మ వెంకటసుబ్బమ్మతో జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు

అమ్మ ప్రేమ అజరామరం

- తల్లి ప్రోత్సాహంతోనే ఉన్నతస్థానాలకు చేరిన బిడ్డలు
- సందర్భం - నేడు అంతర్జాతీయ మాతృదినోత్సవం

అనంతపురం /అనంతపురం కల్చరల్: కల్మషం లేనిది అమ్మ ప్రేమ. అమృతం కన్నా తీయనైన పలుకు అమ్మ పేరు. నవమాసాలు మోసి బిడ్డలను కళ్లలో పెట్టుకుని చూసుకునే తల్లి ప్రేమకు కొలమానం ఉండదు. మాతృ భావన అక్షరాలలో చెప్పలేని, భావాలలో వ్యక్తీకరించలేని తీయని అనుభూతి. ఎంత మంది పిల్లలున్నా కంటికి రెప్పలా కాపాడుకుని ఉన్నత స్థానాలకు చేర్చిన తల్లిదండ్రులు వృద్ధులైపోతే భారంగా భావిస్తున్న రోజులివి. కర్కశ స్వభావమున్న బిడ్డలు తల్లిదండ్రులను నిర్దాక్షిణ్యంగా వదిలేస్తున్నారు. అలా పేగు పాశం కోసం తల్లడిల్లే ఎందరో అమ్మలు జిల్లా కేంద్రం అనంతపురంలోని ఆశ్రమాలలో పిల్లల పిలుపు కోసం వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. తల్లినే దైవంగా భావించి ఆరాధిస్తూ ఉన్నత స్థానాలను చేరుకున్న వారూ మరెంతోమంది ఉన్నారు. స్వచ్ఛమైన అమ్మ ప్రేమను తెలియజేయడానికి చరిత్రలో ఓ రోజును కేటాయించింది. మే నెలలో రెండవ ఆదివారాన్ని 'అంతర్జాతీయ మాతృదినోత్సవం'గా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఆదివారం పలుచోట్ల మాతృదినోత్సవ వేడుకలు జరగనున్నాయి. తల్లులందించిన ప్రేమను చాటుకున్న ప్రముఖులు, అధికారుల అనుభవాలతో మదర్స్ డే సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.

అమ్మాయిలకు చదువు ముఖ్యం

మాది అనంతపురం మండలం ఉప్పరపల్లి. నాన్న రాముడు రైతు. అమ్మ నారాయణమ్మ. ఆడ, మగ ఇద్దరూ సమానమేనని ముఖ్యంగా ఆడపిల్లలకు చదువు చాలా అవసరం అని అమ్మ గట్టిగా నమ్మింది. అలా చదివించడం వల్లే నేను ఎంపీడీఓ స్థాయికి చేరాను. సోదరి డాక్టర్ ఉజ్జినేశ్వరి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తోంది. తమ్ముళ్లు నరేష్, విష్ణువర్ధన్ ఆపరేటర్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఇలా అందరూ మంచి స్థానాల్లో స్థిరపడడానికి అమ్మ ప్రోత్సాహం, అందించిన సహకారమే కారణం. ఆడపిల్లలైనా ఇంటి పని చెప్పకుండా చదవాలంటూ పదే పదే చెప్పేది. అందరు తల్లులూ ఇలాగే ఆలోచిస్తే ఎంత బాగుంటుందో..

– విజయలక్ష్మి, ఎంపీడీఓ, రాప్తాడు


తల్లి నారాయణమ్మతో విజయలక్ష్మి, ఉజ్జినేశ్వరి

దేవుని ప్రతిరూపం అమ్మ

మాటలకు అందనిది అమ్మ. ఆమె ప్రేమ ఈ ప్రపంచాన్నే మరిపింపజేస్తుంది. అంతే కాదు దేవుడు అన్ని చోట్లా ఉండలేక అమ్మను సృష్టించాడు. మనకు జన్మనిచ్చి మనకోసం ఎంతో తాపత్రయపడిన తల్లిదండ్రులను బాగా చూసుకోవాలి. వారిని బాగా చూసుకుంటేనే మన జన్మకు సార్థకత. మాది కంబదూరు మండలం కొత్తపల్లి గ్రామం. అమ్మ పి.తులసీబాయి, నాన్న పి.అర్జున్ నాయక్. నేను ఒక్కడే కొడుకును. ఒక అక్క ఉంది. నలుగురు చెల్లెళ్లు ఉన్నారు. మా నాన్న పోస్టుమాస్టర్‌గా పనిచేశారు. కొన్ని రోజులు అమ్మ అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేశారు. నేను జీవితంలో స్థిరపడడానికి అమ్మ అండదండలే కారణం. ప్రతి దశలోనూ అమ్మ ప్రోత్సాహం ఉంది.

– ప్రొఫెసర్ కేబీ చంద్రశేఖర్, మాజీ వీసీ, కృష్ణా యూనివర్సిటీ.


తల్లి, సోదరీమణులతో చంద్రశేఖర్

18 నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

- విజయవంతం చేయాలని ఈఓ పిలుపు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ ఈఓ కె.వాణి

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 18 నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ ఈఓ కె.వాణి పిలుపునిచ్చారు. ఆలయ సిబ్బందితో కలిసి శనివారం ఆమె హనుమజ్జయంతి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈఓ మాట్లాడుతూ హనుమజ్జయంతి ఉత్సవాలు ఈ నెల 22 వరకు జరుగుతాయన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 18న స్వామివారికి పుష్పాలంకరణసేవ, ఉత్సవ మూర్తికి తులసీదళంతో లక్షార్చన పూజ, 19న స్వామివారికి డ్రైఫ్రూట్స్‌తో అలంకరణ, ఉత్సవ మూర్తికి తమలపాకులతో లక్షార్చన, 20న స్వామివారి శ్రీగంధాలంకరణ సేవ, ఉత్సవ మూర్తికి సింధూరంతో లక్షార్చన, 21న 108 కలశాలతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించిన అనంతరం వివిధ రకాల ఫలాలతో అలంకరణ, ఉత్సవమూర్తికి మల్లెపూలతో లక్షార్చన పూజ నిర్వహిస్తారు. చివరి రోజు ఈ నెల 22న స్వర్ణవజ్రకవచ అలంకరణలో స్వామివారిని తీర్చిదిద్ది, తోమాలతో విశేష పుష్పాలంకరణ, ఉదయం 9 గంటలకు శ్రీరామ పట్టాభిషేకంతో ఉత్సవాలు ముగస్తాయని తెలిపారు.

బాలుడిపై కుక్కదాడి



యల్లనూరు: మండల కేంద్రంలో గురు ప్రజ్వల్ అనే రెండేళ్ల బాలుడిపై కుక్క దాడి చేసి గాయపరిచింది. పాతపేటలోని రజక వీధిలో నివాసముంటున్న కొప్పేల గురుస్వామి, నాగమ్మ దంపతుల కుమారుడు గురు ప్రజ్వల్. తల్లి శుక్రవారం రాత్రి అన్నం తినిపిస్తుండగా ఇంటి ఆవరణలో ఉన్న కుక్క ఒక్కసారిగా ప్రజ్వల్‌పై దాడిచేసింది. వెంటనే బాలుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం కోలుకుంటున్నాడు.

వెరిటాస్ సైనిక్ స్కూల్‌కు ప్రభుత్వ అనుమతి

- దేశ రక్షణకు విద్యార్థులను తయారు చేయడమే లక్ష్యం
- వెరిటాస్ సైనిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ బి.శేషారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బి.శేషారెడ్డి

తిరుపతి కల్చరల్: తిరుపతిలో 22 ఏళ్లుగా బీఎస్‌ఆర్ విద్యాసంస్థల ద్వారా ఇటు విద్యార్థుల ఉన్నతికి, అటు దేశ రక్షణకు అందిస్తున్న సేవలను గుర్తించి భారత ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ సైనిక్ స్కూల్ అనుమతి పొందిందని వెరిటాస్ సైనిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ బి.శేషారెడ్డి తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ విద్యాసంస్థల ద్వారా ఇప్పటికే సుమారు 20 వేల మంది విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడంతో పాటు ఆరు వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని తెలిపారు. అందరి సహకారంతో భారత రక్షణ దశానికి ఎంతో మంది సైనికులను అందించేలా కృషి చేశామన్నారు. వెరిటాస్ సైనిక్ స్కూల్ స్థాపించినప్పటి నుంచి అనుభజ్ఞులైన వారిచే అత్యుత్తమ విద్యను అందస్తూ వస్తున్నామన్నారు. రాబోవు కాలంలో ప్రభుత్వ సైనిక్ స్కూలు అనుసంధానంతో కరికులం, యాక్టివిటీస్, కాంపిటీషన్స్ వంటివన్నీ సైనిక్ స్కూల్ సొసైటీ నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తామన్నారు. వెరిటాస్ స్కూల్లో చదువుకున్న ప్రతి విద్యార్థీ దేశం పట్ల, సమాజం పట్ల బాధ్యతగా ఉండేలా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఇకపై ఆలిండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ పరీక్షల ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేస్తామన్నారు. విద్యా సంస్థలో ప్లస్-1 (ఇంటర్మీడియెట్)తో స్పెషల్ ఎన్‌డీఏను ప్రారంభిస్తున్నామని, ఈ అవకాశాన్ని ఆసక్తి ఉన్నవారి సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో వైరిటాస్ సైనిక్ స్కూల్ డైరెక్టర్లు బి.శ్రీకర్‌రెడ్డి, బి.సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

కారు అదుపుతప్పి ముగ్గురు దుర్మరణం




మృతి చెందిన రాజశేఖర్‌రెడ్డి, యస్విత్ రెడ్డి, ప్రశాంత్

- మరో ఆరుగురికి తీవ్రగాయాలు
- దైవదర్శనానికి వెళ్తుండగా ఘటన

బత్తలపల్లి/కళ్యాణదుర్గం రూరల్: కారు అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ముగ్గురు దుర్మరణం చెందారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. దైవదర్శనం కోసం వెళ్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. బత్తలపల్లి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గాజుల రామ్మోహన్ తన కుటుంబంతో పాటు స్నేహితుడు రాజశేఖర్‌రెడ్డి (45) కుటుంబ సభ్యులు, ముక్తాపురం గ్రామానికి చెందిన ప్రశాంత్ (25) మొత్తం పదిమంది కళ్యాణదుర్గం నుంచి తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనం కోసం కారులో బయల్దేరారు. బత్తలపల్లి సమీపంలోని వై జంక్షన్ వద్దకు రాగానే డ్రైవింగ్ చేస్తున్న రామ్మోహన్ వేగాన్ని అదుపు చేయలేకపోవడంతో కారు బోల్తా పడింది. రామ్మోహన్, అతని భార్య మాధవి, కుమార్తెలు సాన్విక, జత్విక, కౌటిల్ కుమార్, రాజశేఖర్‌రెడ్డి, అతని భార్య దీపిక, కుమారుడు యస్విత్ రెడ్డి (7), కుమార్తె వీరాధ్యతో పాటు స్నేహితుడు ప్రశాంత్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు 108 వాహనంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాజశేఖర్‌రెడ్డి, యస్విత్‌రెడ్డి మృతి చెందారు. ప్రశాంత్ కుమార్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం బెంగళూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృత దేహాలను పోస్టుమార్టం కోసం ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రమేష్ తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులకు మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య సానుభూతి తెలిపారు.


బోల్తాపడిన కారు

అవన్నీ వదంతులే


సోషల్ మీడియాలో వైరల్ అయిన పులుల సంచారం వీడియో

గుత్తి రూరల్: కరిడికొండ శివారు 44వ నంబర్ జాతీయ రహదారి నుంచి కంకర క్రషర్‌కు వెళ్లే మార్గంలో నాలుగు చిరుతలు సంచరిస్తున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అయితే ఇదంతా వదంతులే అని అధికారుల విచారణలో తేలింది. శుక్రవారం అర్ధరాత్రి క్రషర్‌కు వెళ్లే దారి వద్ద బెంగళూరు వైపు వెళ్తున్న లారీలను డ్రైవర్లు నిలిపి సేదతీరుతుండగా నాలుగు చిరుతలు క్రషర్‌కు వెళ్లే దారి వైపు నుంచి వచ్చి పక్కనున్న ముళ్లపొదల్లోకి వెళ్లిపోయినట్లు చెప్పుకుంటున్నారు. కొందరు డ్రైవర్లు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారని, ప్రస్తుతం ఆ వీడియో చక్కర్లు కొడుతోంది. కాగా గుత్తి అటవీ శాఖ గార్డు రమేష్‌ను ఈ విషయం అడగగా సోషల్ మీడియాలో వచ్చిన వీడియో ఫేక్ అని తేల్చారు. అది ఏ ప్రదేశంలోనిదో తెలియదని, వీడియోను తీక్షణంగా పరిశీలిస్తే అవి చిరుతలు కావని, కిందివైపు చారలు ఉన్నందున అవి పులులని తెలుస్తోందన్నారు. అయితే మన ప్రాంతంలో ఎక్కడా పులులు లేవన్నారు. తాము సదరు స్థలాన్ని పరిశీలించామని, ఎక్కడా చిరుతలు లేదా పులుల పాదముద్రలు లభ్యం కాలేదని చెప్పారు.

పెళ్లి వాయిదా.. యువతి ఆత్మహత్య


లక్ష్మీనరసమ్మ (ఫైల్)

గార్లదిన్నె: ఊహించని విధంగా పెళ్లి వాయిదా పడటంతో మనస్తాపం చెందిన యువతి ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ గౌస్ మహమ్మద్‌బాషా తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇల్లూరుకు చెందిన మస్తానయ్య, సుశీలమ్మ దంపతులు బతుకు తెరువు కోసం కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు వలస వెళ్లి అక్కడే జీవనం సాగిస్తున్నారు. కుమార్తె లక్ష్మీనరసమ్మ(23)కు గుంతకల్లు మండలంలోని ఓ యువకుడితో వివాహం నిశ్చయమైంది. ఈ నెల 14, 15 తేదీల్లో వివాహం జరగాల్సి ఉంది. వారం క్రితమే కుటుంబ సభ్యులంతా స్వగ్రామం ఇల్లూరుకు చేరుకున్నారు. పెళ్లి ఏర్పాట్లల్లో తలమునకలయ్యారు. ఈ క్రమంలో బంధువు ఒకరు చనిపోవడంతో పెళ్లి వాయిదా వేశారు. రెండేళ్ల క్రితం కూడా బంధువొకరు చనిపోవడంతో పెళ్లి ఆగింది. వరుస ఘటనలతో మనస్తాపం చెందిన లక్ష్మీనరసమ్మ తనకు కళ్యాణ యోగం లేదేమోనన్న బాధతో శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుంది. పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విపత్తు నిర్వహణ ప్రణాళిక సిద్ధం చేయండి

అనంతపురం అర్బన్: భారత్- పాకిస్తాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళికను యుద్ధప్రాతిపదికన సిద్ధం చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన విజయవంతమైందని ప్రకటించారు. ఎస్పీ, జేసీ, జిల్లా అధికారులు, ఇతర సిబ్బంది బాగా పనిచేశారంటూ అభినందించారు. కలెక్టర్ శనివారం కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ ఎ.మలోలతో కలిసి సీఎం పర్యటన, జిల్లా డిజాస్టర్ మేనేజ్మెంట్ ప్రణాళిక, తదితర అంశాలపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళికలో భాగంగా లాంగ్ సైరన్, షార్ట్ సైరన్‌లను ప్రతి మండలం, మునిసిపాలిటీలు, నగరంలో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సివిల్ డిఫెన్స్ ప్రిపరేషన్‌కు సంబంధించి జిల్లాస్థాయి కంట్రోల్ రూమ్, ఎమర్జెన్సీ ఆపరేషన్ సిస్టం ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆర్‌డీఓలు, తహసీల్దార్లు తమ మండలాల పరిధిలో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు సంబంధించి వివరాలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డీఓ కేశవనాయుడు, కో-ఆర్డినేషన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, తహసీల్దారు హరికుమార్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కృషితోనే హంద్రీ-నీవా పూర్తి

- ప్రజావేదికలో సీఎం చంద్రబాబు అసత్య ప్రచారం
- సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చే దమ్ము లేదు
- ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ధ్వజం



ఉరవకొండ: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కృషితోనే హంద్రీ-నీవా మొదటి దశ పనులు 90 శాతం పూర్తి చేసి జీడిపల్లి వరకు నీటిని తీసుకురాగలిగారని శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తెలిపారు. శనివారం వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని స్వగృహంలో ఎమ్మెల్సీ మీడియాతో మాట్లాడారు. ఛాయాపురం వద్ద సీఎం చంద్రబాబు ప్రజావేదిక సాక్షిగా హంద్రీ-నీవాకు సంబంధించి అసత్యాలు చెప్పారని ధ్వజమెత్తారు. వైఎస్సార్ 40 టీఎంసీల సామర్థ్యంతో హంద్రీ-నీవా పనులు చేపట్టారన్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హంద్రీ-నీవా కాలువ నీటి సామర్థ్యాన్ని 6,300 క్యూసెక్కులకు పెంచుతూ నిర్ణయించారన్నారు. దీనికి సంబంధించి టెండర్లు కూడా పూర్తి చేశారని, పనులు ప్రారంభించే సమయంలో సార్వత్రిక ఎన్నికల కోడ్ వచ్చిందన్నారు. హంద్రీ-నీవాకు 60 నుంచి 70 టీఎంసీలు రావాలంటే కాలువను క్రమం తప్పకుండా వెడల్పు చేయాల్సి ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం మొదటి దశలో వెడల్పు చేస్తాం, రెండో దశ పనుల్లో కాలువకు లైనింగ్ చేస్తామంటే ఈ ప్రాంతానికి తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో రాయలసీమకు సమృద్ధిగా కృష్ణా జలాలు అందాలంటే మొదటి ఫేజ్‌లో 10వేల క్యూసెక్కులతో కాలువను వెడల్పు చేయాలని డిమాండ్ చేశారు. రెండో విడతలో లైనింగ్ పనులు చేపట్టే బదులు ఆ నిధులతో కాలువ వెడల్పు చేస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అనంతపురం జిల్లాపై అపారమైన ప్రేమే ఉంటే కేంద్ర ప్రభుత్వం జిల్లాకు మంజూరు చేసిన ఎయిమ్స్‌ను మంగళగిరికి ఎందుకు తరలించారని ప్రశ్నించారు. దీంతో పాటు కర్నూలుకు మంజూరైన లా యూనివర్సిటీని ఇతర ప్రాంతానికి తరలించి రాయలసీమకు తీరని ద్రోహం చేశారని మండిపడ్డారు. సాంకేతికతతోనే అభివృద్ధి సాధ్యమని చెప్పుకొచ్చే మీరు మరీ అమరావతి రాజధాని కోసం వేలాది కోట్ల రూపాయలు ఎందుకు ఖర్చు పెడుతున్నారో ప్రజలకు చెప్పాలన్నారు. ఛాయాపురంలో ఆర్థిక శాఖ మంత్రి కేశవ్ గ్రామంలో భూములు కౌలుకు ఇస్తే ఎకరాకు రూ.60 వేలు ఇస్తారని చెబుతున్నారని, ఆ గ్రామస్థులతో మాట్లాడి అక్కడి భూములన్నీ కౌలుకు ఇప్పిస్తా ఎకరాకు రూ.60వేలు కచ్చితంగా ఇప్పిస్తారా అంటూ సవాల్ విసిరారు. సూపర్‌సిక్స్ హామీలు నెరవేర్చే దమ్ములేక అబద్ధాలు, డైవర్షన్ పాలిటిక్స్‌తో చంద్రబాబు పాలన సాగిస్తున్నారని ఎద్దేవా చేశారు.

చాగల్లు రిజర్వాయర్‌లో వ్యక్తి గల్లంతు


శ్రీరాములు (ఫైల్)

శింగనమల: ఉల్లికల్లు సమీపంలోని చాగలు రిజర్వాయర్ బ్యాక్ వాటర్‌లోకి దిగిన ఉల్లికల్లు శ్రీరాములు(48) గల్లంతయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. ఉల్లికల్లుకు చెందిన శ్రీరామలుకు భార్య, కుమారుడు ఉన్నారు. శ్రీరాములు శనివారం మద్యం తాగి చాగల్లు రిజర్వాయర్ బ్యాక్ వాటర్‌లో నడుచుకుంటూ వెళ్లాడు. స్థానికులు చూసి అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వచ్చేసరికి అతడు కనిపించలేదు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ విజయకుమార్ తన సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. రెస్క్యూ టీంను పిలిపించి సాయంత్రం వరకు నీటిలో వెతికించినా శ్రీరాములు జాడ కనిపించలేదు.

క్లుప్తంగా

పీఎం నిధికి విరాళం అభినందనీయం



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు చెక్ అందజేస్తున్న సురేష్, కుటుంబసభ్యులు

అనంతపురం అర్బన్: ప్రధానమంత్రి నిధికి విరాళం అందించడం అభినందనీయమని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టర్‌ను శనివారం ఆయన చాంబర్‌లో స్థానిక రామ చంద్రనగర్‌కు చెందిన వెబ్‌సైట్ డిజైనర్ పి.జి.సురేష్, ఆయన సతీమణి రాజేశ్వరి, కుమార్తెలు సత్య, శ్రావణి కలిసి పీఎం నిధికి విరాళం రూ.52 వేల చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించారు. సురేష్ మాట్లాడుతూ తన తండ్రి పి.జి.కొండప్ప స్వాతంత్ర్య సమర యోధుడని తెలిపారు. ఆయన బాటలో తాము దేశం కోసం విరాళం అందించామన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: మే 20న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఎన్జీవో హోంలో కార్మిక సంఘాల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులు, రాజారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడానికి మే 20న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె చేపట్టాలని నిర్ణయించారన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నా అమలు కావడం లేదన్నారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, 12వ వేతన చట్టం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కృష్ణుడు, ముత్తూజా, మల్లికార్జున, నాగేంద్ర, రాజేష్, ఓబిరెడ్డి, ఏసురత్నం, చంద్రశేఖర్, కంబన్న, ఆర్‌వీ నాయుడు, వెంకట నారాయణ, ఖాజా, రాజు తదితరులు పాల్గొన్నారు.

చంద్రమోహన్ సేవలు చిరస్మరణీయం



చంద్రమోహన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వెటరన్ క్రికెటర్లు

అనంతపురం: జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి సీనియర్ క్రికెటర్ చంద్రమోహన్ చేసిన కృషి చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. ఆర్డీటీ స్టేడియంలో సీనియర్ క్రికెటర్ చంద్రమోహన్ మెమోరియల్ క్రికెట్ (టీ-20) టోర్నమెంట్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమానికి జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి భీమలింగా రెడ్డి అధ్యక్షత వహించారు. ఆంధ్ర మహిళా క్రికెట్ ఆపరేషన్స్ మాజీ మేనేజర్, వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు మచ్చా రామలింగా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చంద్రమోహన్ స్మారకార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. రాబోవు రోజుల్లో చంద్రమోహన్ పేరు మీద రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తామన్నారు. అనంతరం అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్, ఆర్డీటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న టీ-20 మ్యాచ్‌లు ఆర్డీటీ క్రీడా మైదానంలో ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో సీనియర్ క్రికెటర్లు యుగంధర్ రెడ్డి, విజయరాజు, నరేష్, బొమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

16న డీఎస్సీ హిందీ మోడల్ పరీక్ష

అనంతపురం ఎడ్యుకేషన్: హిందీ సేవా సదన్ ఆధ్వర్యంలో ఈనెల 16న హిందీ సేవా సదన్ ప్రత్యేక యాప్ ద్వారా ఉచితంగా డీఎస్సీ హిందీ ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించనున్నట్లు సేవా సదన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఎస్.గైబువల్లి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 16న సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకు మోడల్ పరీక్ష జరుగుతుందన్నారు. డీఎస్సీలో హిందీ స్కూల్ అసిస్టెంట్, టీజీటీ హిందీ, పీజీటీ హిందీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఈ మోడల్ పరీక్ష చాలా ఉపయోగపడుతుందన్నారు. ఆన్‌లైన్‌లో పరీక్ష రాసే విధానం, సిలబస్ అనుసారంగా ప్రశ్నపత్రం, సమయపాలన తదితర అంశాలపై అవగాహన కల్గుతుందన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 95813 86150, 95536 77116, 98487 83787 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

సందడే సందడి

అనంతపురం కల్చరల్: చిన్నారులందరూ వేసవి సెలవలను ఎంజాయ్ చేస్తున్నారు. వేసవి శిక్షణా శిబిరాల్లో ఉల్లాసంగా ఉత్సాహంగా గడుపుతున్నారు. ఆటపాటలతో పాటు సృజనాత్మక అంశాలను అభ్యాసం చేస్తున్నారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇక.. పిల్లల్లో ప్రతిభా పాటవాలను మరింత పెంచే దిశగా శిక్షణా శిబిరాలు వినూత్న కార్యక్రమాలను రూపొందిస్తున్నాయి. ఒకప్పుడు సమ్మర్ క్యాంప్ అంటే డ్యాన్సులు, సంగీతం తదితర అంశాలకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చేవారు. కానీ నేడు కరాటే, క్రాఫ్ట్స్, సెమీక్లాసికల్, వెస్ట్రన్, ఫోక్, డిజైన్ పాట్ మేకింగ్, డ్రాయింగ్ వంటి కళల్లో తర్ఫీదు పొందుతున్నారు. శాస్త్రీయ నృత్యాలు, సంగీతం శిబిరాలు సంప్రదాయాలు, సంస్కృతిని ఘనంగా చాటుతున్నాయి.



పీటీసీలో క్రికెట్‌లో మెలకువలు నేర్చుకుంటున్న విద్యార్థులు



డ్యాన్స్‌లో తర్ఫీదు పొందుతున్న బాలికలు



కరాటే నేర్చుకుంటున్న చిన్నారులు



గోలీలు ఆడుతూ..

పొలాలకు వెళ్లేందుకు దారి చూపండి

- రోడ్డుపై బైఠాయించిన పాములరాయి, పొడరాళ్ల రైతులు



రోడ్డుపై నిరసన తెలియజేస్తున్న పాములరాయి, పొడరాళ్ల రైతులు

రాప్తాడురూరల్: పొలాలకు వెళ్లేందుకు దారి చూపాలని అనంతపురం రూరల్ మండలం పాములరాయి, బుక్కరాయసముద్రం మండలం పొడరాళ్ల గ్రామాల రైతులు కోరారు. ఎన్నిమార్లు చెప్పినా అధికారులు పట్టించుకోకపోవడంతో శనివారం రైతులు పాములరాయి సమీపంలో హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రాజధాని అమరావతికి వెళ్లేందుకు బెంగళూరు, హైదరాబాద్ జాతీయ రహదారి-44కు అనుసంధానం చేస్తూ జాతీయ రహదారి 544-డీని ఏర్పాటు చేశారన్నారు. ఇందుకోసం అనంతపురం రూరల్ మండలం పాములరాయి వద్ద ప్రత్యేక జంక్షన్ ఏర్పాటు చేశారని తెలిపారు. బెంగళూరు-హైదరాబాద్ 44 హైవే నుంచి ప్రారంభమైన 544-డీ కోసం పాములరాయి, పొడరాళ్ల గ్రామాల రైతులు తమ భూములను అతి తక్కువ ధరకు ఇచ్చామన్నారు. రోడ్డు రావడం వల్ల తమకు అన్ని రకాల సౌలభ్యం ఉంటుందని ఆశ పెట్టుకున్నామని, అయితే ప్రారంభంలో ఎనిమిది వందల మీటర్ల సర్వీస్ రోడ్డును వేయకుండా వదిలి పెట్టేశారని, దీనివల్ల పొలాలకు వెళ్లే రైతులకు సర్వీస్ రోడ్డు లేకుండా పోయిందన్నారు. పశువులకు ధాన్యం, గడ్డి తీసుకుపోవాలంటే మెయిన్ రోడ్డు నుంచి పొలాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. దీంతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరితో పాటు రాష్ట్రంలోని ఎంపీలు, ఎమ్మెల్యేలకు అనేక పర్యాయాలు వినతి పత్రాలు సమర్పించామన్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి సానుకూలంగా స్పందించినా విజయవాడలో ఉన్న ఆర్వో ఆర్‌కే సింగ్ వ్యతిరేకంగా రిపోర్టు ఇస్తున్నారని రైతులు కలిమిశెట్టి రఘు, కలిమిశెట్టి నాగేంద్ర, ముగతాళ్ల సుబ్బారావు, ఎక్క రామాంజనేయులు, కే. నారాయణ స్వామి, గంటా మధు, కలిమిశెట్టి బాబు, తాళ్ల అనిల్, మిద్దె వెంకటరమణ వాపోయారు. రైతుల సమస్యను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రోడ్డును బ్లాక్ చేస్తామని హెచ్చరించారు.

ఆర్డీటీ సంస్థకు నిధులు కొనసాగించాలి



ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్‌తో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

అనంతపురం: కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీ సంస్థకు నిలుపుదల చేసిన నిధుల రాకను తిరిగి కొనసాగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కోరారు. శనివారం అనంతపురంలోని ఆర్డీటీ కార్యాలయంలో ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్‌ను మర్యాద పూర్వకంగా సీపీఐ నాయకులు కలిశారు. కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్‌ను నిలుపుదల చేయడంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేద ప్రజలకు తీరని అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ సమస్యపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, అనంతపురం జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి, రైతు సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ తరలిపోతే చీకట్లోకి పేదల బతుకులు

అనంతపురం టవర్‌క్లాక్: ఆర్డీటీ తరలిపోతే పేదల బతుకులు చీకట్లోకి జారిపోతాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆర్డీటీని రక్షించుకుందామంటూ నగరంలో అఖిల పక్ష కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిధులు రాకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. ఆంక్షలు ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు సాకే హరి, గోవింద రాజులు, అనిల్‌కుమార్, వేమన, నాగిరెడ్డి, అత్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల పీచమణచాలి

పాకిస్తాన్ ఉగ్రవాదుల పీచమణచాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి అన్నారు. ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో దాదాగాంధీ, సాకే శివ శంకర్, ఇమాం, కిశోర్, ఓబులేసు, రాము యాదవ్, వంశీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి

అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వం న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని రెండోరోడ్డు వద్ద ఉన్న స్టడీ పార్క్‌లో డీఎస్సీ అభ్యర్థులతో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్సీ నిర్వహణపై అభ్యర్థులు పలు సమస్యలను ఏకరువు పెట్టారు. అనంతరం గేయానంద్ మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షల సమయం పెంపునకు జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు స్పందించి అభ్యర్థులకు అండగా నిలవాలన్నారు. హెవీ సిలబస్ ఉన్నందున సన్నద్ధం కావడానికి 90 రోజులకు సమయాన్ని పొడిగించాలన్నారు. కరువు జిల్లాలో ఎస్జీటీ పోస్టులు పెంచాలన్నారు. 'ఒకే జిల్లా -ఒకే పరీక్ష పేపర్' ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఓసీ అభ్యర్థులకు వయో పరిమితి 47 సంవత్సరాలకు పెంచాలన్నారు. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు ఇంటర్, డిగ్రీలో మార్కులు 45 శాతం ఉంటేనే డీఎస్సీకి అర్హత అని ప్రకటించారన్నారు. బీఈడీ, టెట్, డైట్‌లో 40 శాతానికే అర్హత ఇచ్చారని గుర్తు చేశారు. డీఎస్సీలో కూడా అదేవిధంగా 40 శాతం ఉంటే అర్హతగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కసాపురం రమేష్, జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణోత్సవం





ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత నారసింహుడు, కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

అనంతపురం కల్చరల్: భక్తుల కొంగుబంగారంగా పూజలందుకుంటున్న లక్ష్మీ నరసింహస్వామి జయంతి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. రెండు రోజుల పాటు సాగే నరసింహస్వామి జయంతి వేడుకల ప్రారంభం సందర్భంగా వందలాదిగా తరలి వచ్చిన భక్తజనంతో స్థానిక పాతూరులోని వ్యాసరాజ మఠం (చిన్నాంజనేయస్వామి ఆలయం) కిటకిటలాడింది. ఉదయం వివిధ దేవతామూర్తులకు నిర్మాల్య విసర్జన, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకార సేవలు నయనానందకరంగా నిర్వహించారు. అనంతరం మన్యుసూక్త హోమాన్ని రుత్వికులు శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ సందర్భంగా నయన మనోహరంగా సాగిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనరసింహస్వామి కల్యాణోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరి స్వామివారి నామస్మరణతో మార్మోగించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా సాగిన కల్యాణంలో వివిధ మతాల ప్రతినిధులు పాల్గొని తీర్థప్రసాదాలందుకున్నారు. సాయంత్రం ఉత్సవ మూర్తులతో నగరోత్సవం, సాంస్కృతిక సంబరాలు, స్వస్తివచనం, మహామంగళహారతి జరిగాయి. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు శ్రీకాంత్, హరినారాయణ, రఘునాథ్ , సత్యనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అమర వీరుడికి ఘన నివాళి



వీర జవాన్ మురళీనాయక్‌కు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న విద్యార్థులు



రాప్తాడులో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ సైనికులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు

- వీర జవాన్ పోరాటం స్ఫూర్తిదాయకం
- రాప్తాడులో మాజీ సైనికుల ర్యాలీ

అనంతపురం: యుద్ధంలో అమరుడైన అగ్నివీర్ మురళీనాయక్ చిత్రపటానికి ఎన్ఎస్‌యూఐ నాయకులు ఘన నివాళి అర్పించారు. వీరమరణం పొందిన మురళీనాయక్‌కు శనివారం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద కొవ్వొత్తులతో అంజలి ఘటించారు. యుద్ధంలో ధైర్యంగా పోరాడి వీర మరణం పొందాడని, అతని ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు పులి రాజు, శంకర్, అంజి నాయక్, సురేష్, శాంతి రాజు, రవి, వీర, ఎర్రిస్వామి, రజిని, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

త్యాగాన్ని దేశం మరువదు..

రాప్తాడు: వీర జవాన్ మురళీ నాయక్ మృతి యావత్ దేశాన్ని దుఃఖసాగరంలో ముంచిందని, ఆయన పోరాట స్ఫూర్తి ఆదర్శనీయమని పలువురు వక్తలు కొనియాడారు. శనివారం సాయంత్రం రాప్తాడులో వీర జవాన్ మురళీ నాయక్‌కు అంజలి ఘటిస్తూ మాజీ సైనికుల ఆధ్వర్యంలో 44వ జాతీయ రహదారి నాలుగు రోడ్ల కూడలి నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ సైనికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విశ్వేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్ల సుదర్శన్ రెడ్డి, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నల్లపరెడ్డి, జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మాట్లాడారు. 'ఆపరేషన్ సిందూర్'లో అసువులు బాసిన జవాన్ మురళీ నాయక్ యువతరానికి ఆదర్శనీయమన్నారు. దేశం కోసం ఆయన వీరమరణం పొందారని, ఆయన ఆత్మకు శాంతి కలగాలన్నారు. ఏకైక బిడ్డను కోల్పోయిన మురళీ నాయక్ తల్లిదండ్రుల ఆవేదన తీర్చలేనిదని, దేశం కోసం తమ బిడ్డను త్యాగం చేసిన ఆ తల్లిదండ్రులను దేశం మరవబోదన్నారు. కార్యక్రమంలో విశ్రాంత మాజీ సైనికులు సుంకిరెడ్డి, తిరుపాల్‌రెడ్డి, కృష్ణమనాయుడు, పురుషోత్తం, గిరివర్ధన్‌రెడ్డి, బోయ ఈశ్వరయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు సాకే చంద్ర, చింతకాయల జయన్న తదితరులు పాల్గొన్నారు.

పునర్వ్యవస్థీకరణలో అసంబద్ధాలు తొలగించాలి



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణలో ఉన్న అసంబద్ధాలను తొలగించాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం డీఈఓ ప్రసాద్ బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవింద రాజులు, లింగమయ్య మాట్లాడుతూ అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1:20 నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలన్నారు. అన్ని మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో 5 తరగతులు బోధించడానికి ఐదుగురు టీచర్లను నియమించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్య 75 మించితే పీఎస్ హెచ్‌ఎం పోస్టును అదనంగా కేటాయించాలన్నారు. అలాగే విద్యార్థుల సంఖ్య 120కి మించితే 6వ ఎస్జీటీ పోస్ట్, ఆ పైన ఉన్న ప్రతి 30 మందికి ఒక ఎస్జీటీ చొప్పున కేటాయించాలని కోరారు. ఉర్దూ మైనర్ మీడియం బోధించే ఉపాధ్యాయులను తెలుగు మీడియం ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్‌లతో కలిపి లెక్కించి పోస్టులు కేటాయించడం సరికాదన్నారు. ఆ పోస్టులు అదనంగా ఇవ్వాలన్నారు. అన్ని ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కేటాయించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో సమాంతర మీడియంలో బోధన కొనసాగించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో తరగతి రోల్ 45 మించినప్పుడు రెండో సెక్షన్ ఏర్పాటు చేయాలన్నారు. వాటి ఆధారంగా పోస్టులను కేటాయించాలన్నారు. విద్యార్థుల సంఖ్య 300 దాటితే రెండో పీడీ పోస్ట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. డీఈఓను కలిసిన వారిలో యూటీఎఫ్ నాయకులు రమణయ్య, సుబ్బరాయుడు, బ్రహ్మానంద, శ్రీనివాసులు, శేషప్ప, రమేష్, ఓబుళపతి, వెంకటనాయుడు, శివరుద్రప్ప ఉన్నారు.

పెట్టుబడి సాయం ఒకే దఫాలో ఇవ్వాలి

అనంతపురం అర్బన్: పీఎం కిసాన్ సమ్మాన్ నిధితో సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ కింద రైతులకు పెట్టుబడిసాయం రూ.20 వేలు ఒకే దఫాలో ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రైతు సంక్షేమంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన మాటలే ఇందుకు నిదర్శమన్నారు. పీఎం కిసాన్‌తో కలిపి పెట్టబడి సాయం మూడు విడతల్లో ఇస్తామని చెప్పడం రైతులకు అన్యాయం చేయడమేనన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రతి రైతుకూ రాష్ట్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధితో సంబంధం లేకుండా రూ.20 వేలు ఒకేసారి ఇవ్వాలన్నారు. కౌలు రైతులకూ పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలన్నారు. హంద్రీ-నీవా కాలువ సామర్థ్యం 10 వేల క్యూసెకులకు పెంచాలని రైతులు, రైతు సంఘాలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. మొదటి ఫేస్‌లో 3,850 క్యూసెక్కులకు కుదించి, రెండవ ఫేస్‌లో కాంక్రీట్ లైనింగ్ పనులు చేయడం వల్ల ఆయకట్టు రైతులకు, ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో సంఘం ఉపాధక్షుడు శివారెడ్డి, సభ్యులు సంజీవరెడ్డి, ఒన్నూరప్ప పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు

అనంతపురం అగ్రికల్చర్: విజయవాడ కీట్స్ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీడీయూ, జీకేవై కార్యక్రమం కింద రెండు నెలల పేషెంట్ రిలేషన్‌షిప్ అసోసియేట్ (పీఆర్‌ఏ) కోర్సుతో పాటు స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్స్, లైఫ్ స్కిల్స్ అంశాల్లో శిక్షణ ఉంటుందన్నారు. 19 నుంచి 30 సంవత్సరాల వయస్సుతో పాటు ఇంటర్ పాస్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులు అర్హులన్నారు. శిక్షణా కాలంలో భోజన సదుపాయంతో పాటు ఉచిత వసతి కల్పిస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం 100 శాతం ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9000487423 నంబరులో సంప్రదించాలని సూచించారు.

అమ్మను మించిన దైవం లేదు



'తల్లికి వందనం' కార్యక్రమంలో పిల్లలను ఆశీర్వదిస్తున్న తల్లులు

రాప్తాడు: అమ్మను మించిన దైవం లేదని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పేర్కొన్నారు. శుక్రవారం రాప్తాడులో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా 'తల్లికి వందనం' కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహించారు. ముందుగా తల్లులను ఘనంగా సన్మానించి, వారికి పిల్లలతో పాదాభివందనం చేయించి ఆశీర్వాదం ఇప్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, లక్ష్మీదేవి, భారతి, ముత్యాలమ్మ మాట్లాడుతూ... చిన్నారుల్లో నైతిక విలువలు పెంచేందుకు అందరూ కృషి చేయాలన్నారు. తమ వంతుగా 'తల్లికి వందనం' పేరుతో విద్యార్థుల్లో మంచి విలువలు పెంచే విధంగా, తల్లిదండ్రులను గౌరవించే కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం



మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు క్యాన్సర్ నిర్ధారణ, ఇతర ఆరోగ్య సమస్యలపై పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ఎస్పీ పి. జగదీష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే క్యాన్సర్ ప్రాణాంతకం కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డీవీ రమణ మూర్తి, డాక్టర్లు పాల్గొన్నారు.

మాతృశక్తి ఫౌండేషన్ ఏర్పాటు



ఫౌండేషన్ లోగో ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక సెయింట్ జోసెఫ్ విద్యా సంస్థల పూర్వ టీచర్లు, విద్యార్థులంతా కలిసి మాతృశక్తి ఫౌండేషన్ పేరుతో ఒక సంస్థ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శనివారం ఫౌండేషన్ ఆవిర్భావ సభను నగరంలో ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకులు ఆర్. శశికళ అధ్యక్షత వహించగా.. ముఖ్య అతిథులుగా మానవత సంస్థ కన్వీనర్ తరిమెల అమరనాథరెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథం, సామాజిక స్పృహ పెంచే అంశాలను పాఠ్యాంశాలుగా ప్రవేశపెడితే యువత మహా మనుషులుగా ఎదుగుతారన్నారు. అనంతరం ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన రెయిన్‌బో హోమ్ విద్యార్థులకు సెయింట్ జోసెఫ్ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. మాతృశక్తి ఫౌండేషన్ లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మీనాక్షమ్మ, రమణ, సద్దాం, లెనిన్ శ్రీనివాస్ నాయక్, సలీం మాలిక్, సెయింట్ జోసెఫ్ పాఠశాలల పూర్వ అధ్యాపక బృందం విజయలక్ష్మి, కిషోర్ కుమార్, నరసింహులు, సత్యప్రభ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్

కనగానపల్లి: ఉపాధ్యాయ నియామకాల కోసం నిర్వహించే డీఎస్సీ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచితంగా ఆన్‌లైన్ కోచింగ్ శిక్షణ ఇస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ మండల అధికారి వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ధర్మవరం తహసీల్దార్ కార్యాలయంలో వెనుక వైపు ఉన్న బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.